క్లుప్తంగా

129 మందికి వితంతు పింఛన్‌లు

చినగంజాం: మండలంలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న 129 మందికి వితంతు పింఛనులు మంజూరైనట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సీహెచ్ పూర్ణ చంద్రరావు తెలిపారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో చినగంజాం 1లో 11 మంది, చినగంజాం 2లో 5 గురు, గొనసపూడి 15, కడవకుదురు 1లో 5 గురు, కడవకుదురు 2లో 8 మంది, కొత్తపాలెంలో 14, మోటుపల్లిలో 10, మున్నంవారిపాలెంలో 9, పల్లెపాలెం 4, పెదగంజాం 1లో 16 మంది, పెదగంజాం 2లో 13 మంది, రాజుబంగారుపాలెం 8, సంతరావూరులో 11 మందికి వితంతు పింఛను మంజూరయ్యాయని వివరించారు.

ఘనంగా అమ్మవారి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యద్దనపూడి: మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలేరమ్మ తల్లి, ఉపదేవత శ్రీ ఊర అంకమ్మ తల్లి ఆలయ అనంత వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమార్చనలు, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు పాలపొంగళ్లు నివేదించి అమ్మవారికి పసుపుకుంకుమ, సారె సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం జరిగింది.

ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పిస్తాం

ఇంకొల్లు(చినగంజాం): ఎస్సీ, ఎస్టీలకు చట్టపరంగా రక్షణ కల్పించేందుకు తాము చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఏపీఎస్ శ్రీనివాస్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండలం కేంద్రమైన ఇంకొల్లు స్టాలిన్ పేటలో సభ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కులస్తుల పట్ల ఎవరైనా వివక్షత ప్రదర్శించినా, సాంఘిక దురాచారాలైన అంటరానితనం, రెండు గ్లాసుల విధానం, కులం పేరిట దూషించటం, మహిళల పట్ల లైంగిక వేధింపులు, బాలికలపై అత్యాచారాలు వంటి విషయాలను తమ దృష్టికి తీసుకొని రావాలని కోరారు. అటువంటి సంఘటనలను బహిరంగంగా చెప్పుకునేందుకు భయపడితే అర్జీల రూపంలో తమకు అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి చట్టపరంగా రక్షణ కల్పిస్తామని, హక్కులను కాపాడతామని తెలియజేశారు. ఏఎస్‌డబ్ల్యూఓ ఫ్రాంక్లిన్ మాట్లాడుతూ ప్రభుత్వమే ప్రజల వద్దకు వచ్చి ఎస్సీ, ఎస్టీ ప్రజలకు న్యాయం చేయుటకై పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తుందని ఎటువంటి సంకోచం లేకుండా అన్ని విషయాలు తమ దృష్టికి తీసుకొని వస్తే న్యాయం చేస్తామన్నారు. ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు సురేష్, రాజేష్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మున్షీప్రేమచంద్ జయంతి


ప్రేమచంద్‌కు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో హిందీ నవలా రచయిత మున్షీ ప్రేమచంద్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం దీప్తి మాట్లాడుతూ సమస్యలు ఎదురైనా అడ్డంకులు తొలగించుకుంటూ ముందుకు సాగాలన్నారు. జీవితం సమస్యల్లో ఉందని, జీవించడాన్ని ఆపివేయకుండా ముందుకు సాగిపోవాలన్న తపన కలిగి ఉండటమే జీవితం అని చక్రవర్తి ప్రేమచంద్ పేర్కొన్నట్లు తెలిపారు. హిందీ ఉపాధ్యాయురాలు శంఖం లలితా పరమేశ్వరి మాట్లాడుతూ ఆయన రచనలు స్వాతంత్రోద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచాయన్నారు. ప్రసన్నాంజ నేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని గ్రామాల ప్రజలు చెత్తను పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని ఈపురుపాలెం పంచాయితీ కార్యదర్శి మురళీబాపూజీ సూచించారు. మండలంలోని ఈపురుపాలెం గ్రామంలో గురువారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే చెత్తను పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందికి అందించడంతో పాటుగా జనవాసాల మధ్య

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

చీరాల: ద్విచక్రవాహనం చోరీపై గురువారం ఈపూరుపాలెం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒంగోలుకు చెందిన జయపాల్ ఈనెల 21న నూతనంగా కొనుగోలు చేసిన ద్విచక్రవాహనంపై వాడరేవు సముద్రస్నానానికి వచ్చాడు. తీరం ఒడ్డున వాహనాన్ని నిలిపి స్నానం చేసి వచ్చి చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ.చంద్రశేఖర్ తెలిపారు.

శిథిల'బడి' చదువు చెడి!


ఏల్చూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల


శిథిలావస్థలో ఉన్న పాఠశాల గదులు

- శిథిలావస్థకు చేరిన ఏల్చూరు ప్రాథమిక పాఠశాల
- పెచ్చులూడుతున్న శ్లాబు
- బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంతమాగులూరు(అద్దంకి):

విద్యాశాఖ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు శిథిల బడుల్లోనే బిక్కు బిక్కుమంటూ చదువుకుంటున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో శ్లాబు నుంచి పెచ్చులు ఎప్పుడు రాలి పడతాయో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు భయపడుతున్నారు. చేసేదీమీలేక ఓ మోస్తరుగా ఉన్న రెండు గదుల్లో విద్యార్థులను కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. మండలంలోని ఏల్చూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను 1942లో


పెచ్చులూడుతున్న శ్లాబు

ఏర్పాటు చేశారు. అప్పట్లో నిర్మించిన ఒక బిల్డింగ్ ఇప్పటికీ ఉంది. ఆ తరువాత రెండు దఫాలుగా నాలుగు అదనపు గదులు నిర్మించారు. ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదివే 110 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలో రెండు గదులు మినహా మిగిలిన మొత్తం గదులకున్న శ్లాబు పెచ్చులూడుతోంది. ఎప్పుడు పై కప్పు కిందపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు ఏం చేయాలో తోచక, బాగున్న రెండు గదుల్లోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. వాతావరణం సక్రమంగా ఉంటే కొంత సేపు శిథిల భవనంలో పాఠాలు చెబుతున్నారు. నూతన పాఠశాలను నిర్మించాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి సమస్య.**
> పాఠశాల భవనం చాలా పాతది. దాని తరువాత నాలుగు గదులు కట్టినా అవి కూడా అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులకు బోధించాలంటే చాలా భయంగా ఉంది. ఈ పరిస్థితి ఎప్పటికి మారుతుందో తెలియడం లేదు.
> విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు

ఉద్యోగం లేదు.. నిరుద్యోగ భృతి లేదు


దేగరమూడి ఆదర్శనగర్ కాలనీలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మార్టూరు: బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోయారని మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. మండలంలోని డేగరమోడీ ఆదర్శనగర్ కాలనీలో గురువారం సాయంత్రం మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. అధికారం అప్పగిస్తే యువతకు లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అప్పటివరకు నిరుద్యోగులకు ప్రతినెలా 3 వేల రూపాయలు నిరుద్యోగ భృతి అందిస్తామని నాడు ప్రజలకు చేసిన వాగ్దానం ఏమైందని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో పార్టీ, కుల, మత రహితంగా ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో విద్యా దీవెన పథకం ద్వారా నగదు జమ కాగా ప్రస్తుత ప్రభుత్వంలో ప్రచారమే తప్ప పనితనం కనిపించని లోపభూయిష్టంగా మారిందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇంటింటికి వెళ్లి నాయకులు పథకాల అమలులో గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వానికి మధ్యగల తేడాలను వివరించి కూటమి ప్రభుత్వపు అబద్ధపు హామీల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి, మార్టూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు అడకా గంగయ్య యాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాలేషా వలి, పార్టీ నాయకులు ఉప్పలపాటి అనిల్ చౌదరి, గడ్డం మస్తాన్ వలి, మైలా చిన్న నాగేశ్వరరావు, మోషే నాయక్, చిన్న నాయక్ తమ్ములూరి సురేష్, గొట్టిపాటి ఆనంద్, అంజి బాబు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమిత్వ సర్వేపై అవగాహన కల్పించండి


సిబ్బందికి సర్వేపై శిక్షణ ఇస్తున్న అధికారులు

పర్చూరు(చినగంజాం): సమిత్వ సర్వేపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్ సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ సహాయకులకు, వీఆర్వోలకు, సర్వేయర్లకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు సమిత్వ సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ కంఠాల్లో గృహాలు నిర్మించుకొని నివాసముంటున్న గృహ యజమానులకు ఆస్తి యాజమాన్య ధ్రువపత్రాలు జారీ చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్చూరు మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో ఆగష్టు 1 వ తేదీ నుంచి గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామని.. గృహ యజమానులు సర్వే చేసే సమయంలో అందుబాటులో ఉండాలని తెలిపారు. రోవర్ ఉపయోగించి ఫీల్డ్‌లో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం


అద్దంకి మున్సిపల్ సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కౌన్సిలర్‌లు

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపల్ చైర్మన్ ఎస్తేరమ్మ అధ్యక్షత గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 20 అంశాలు గల అజెండాలోని అంశాలను మున్సిపల్ ఆర్ఐ అర్జునరావు చదివి సభకు వినిపించారు. స్థానిక 13వ వార్డు, 4వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం, 14 వార్డులోని డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నట్లు పెర్కొన్నారు. 5వ వార్డు రాజీవ్ కాలనీలో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి బొమ్మనం పాడు రోడ్‌లోని జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకునేందుకు బోరు, పైప్‌లైన్‌లు రిపేర్లు, ట్యాంక్, వాటర్ సంపులు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది.

కౌన్సిలర్‌ల వాదోపవాదనలు..

సమావేశంలో భాగంగా పట్టణంలోని 20 వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు తన వార్డులోని చిల్ల చెట్లు ఎక్కువగా ఉన్నాయని వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో టీడీపీ కౌన్సిలర్‌లు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లతో వాదనకు దిగడంతో కమిషనర్ సర్ది చెప్పారు. కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

6న ఉపకరణాల అందజేత

బల్లికురవ: అద్దంకిలోని సత్రం బడిలో నెల 6వ తేదీ మెడికల్ క్యాంపులో ఉపకరణాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో 1,2 లు కె. శ్రీనివాసరావు కె. రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఈక్యాంపులో మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటు పాఠశాలల్లో విద్య అభ్యసించే 18 సంవత్సరాల్లోపు దివ్యాంగ విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్, సదరం సర్టిఫికెట్ జెరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఉదయం 9 గంటలకే క్యాంపు వద్దకు చేరుకోవాలని సూచించారు.

ఉపాధి పనులు కల్పించాలి

చీరాల టౌన్: ఉపాధి పనులను గుర్తించి ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఏపీవో దాసు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో సచివాలయాల అడ్మిన్లు, ఎఫ్ఏలు, టీఏలతో సమావేశాన్ని నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా చర్యలు తీసుకుని ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవసరమైన ప్రతి పనిని రికార్డు చేసి పనుల సంఖ్య పెంచాలన్నారు.

క్షయ వ్యాధి రహిత సమాజం ప్రభుత్వ లక్ష్యం


పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు శ్రీహర్ష, అశోక్ రెడ్డి

మార్టూరు: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని సంబంధిత రోగులు నిర్భయంగా పరీక్షలు చేయించుకొని వైద్య సౌకర్యాలు వినియోగించుకోవాలని మార్టూరు మండల టీబీ యూనిట్ డాక్టర్ శ్రీహర్ష అన్నారు. మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో గురువారం మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు, యద్దనపూడి మండలాల క్షయ రోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షయ వ్యాధి రోగులకు జబ్బు తగ్గేంత వరకు ఉచితంగా మందుల పంపిణీ చేసి ప్రతినెలా 1000 రూపాయలు ఆర్థిక సహాయం ప్రభుత్వ పరంగా అందుతుందని తెలిపారు. సమతుల పోషకాహారంతో వ్యాధిని త్వరగా నిర్మూలించవచ్చన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె. వెంకట మురళి, నామ్ ఎక్స్‌ప్రెస్ వేవ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నాలుగు మండలాలలోని 70 మంది క్షయ రోగులకు 11 రకాల పోషక పదార్థాలతో కూడిన కిట్లను సూపరింటెండెంట్ డాక్టర్ అశోక రెడ్డి తో కలిసి శ్రీహర్ష పంపిణీ చేశారు. ఆసుపత్రి సిబ్బంది, టీబీ యూనిట్ సిబ్బంది, రోటరీ ప్రతినిధి సాంబశివరావు పాల్గొన్నారు.

చీరాల రూరల్: క్షయవ్యాధిని అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాపట్ల జిల్లా డీటీసీ కార్యాలయ టీబీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సీహెచ్ ప్రఫుల్ల అన్నారు. వందరోజుల ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఏరియా వైద్యశాలలోని టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ అంతమొందిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టీబీ యూనిట్ వద్ద, మరియమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద క్షయ వ్యాధి బాధితులకు కందిపప్పు, వేరుశనగపప్పు, మినపప్పు, గోధుమపిండి, బెల్లం, రాగిపిండి, కోడిగుడ్లు వంటి పౌష్టికాహారం పంపిణీ చేశారు. టీబీవ్యాధి బారినపడినవారు మందులు వేసుకుంటూ మంచి బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. రెండువారాలు మించి దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, బరువు తగ్గిపోవడం, ఆకలిలేకపోవడం, ఆయాసం, కళ్లెలో రక్తం పడటం వంటి లక్షణాలున్నట్లయితే కళ్లె పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల నుంచి తొమ్మిది నెలలపాటు యాంటీ టీబీ మందులు వాడుకోవాలన్నారు. వీరికి ప్రభుత్వం రూ. 1,000 బ్యాంకు అకౌంట్లో జమచేస్తుందని చెప్పారు. డాక్టర్ శిరీష, టీబీ యూనిట్ సిబ్బంది టి. నరేంద్రబాబు, రియాజ్, వర్షధార, శ్రీలక్ష్మి, నీలిమ, హరికాంత్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసేవారికి శాశ్వత గుర్తింపు


కేబీకే రెడ్డిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

చీరాల అర్బన్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారు ఎప్పటికి గుర్తుండిపోతారని ఆర్టీసీ చీరాల డిపో మేనేజర్ జె.శ్యామల అన్నారు. గురువారం ఆర్టీసీ చీరాల డిపోలో పనిచేస్తూ డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కోకి బాలకోటేశ్వరరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో అభినందన సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కేబీకే రెడ్డి ఎంతో సౌమ్యుడని, బాధ్యతగా డ్యూటీ చేశారన్నారు. 29 సంవత్సరాలు సేవ చేశారన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగిగా ఆయన బాధ్యతలు నిర్వహిస్తూనే ఉద్యోగుల సంక్షేమం కోసం ఎస్‌డబ్ల్యూఎఫ్ సీఐటీయూ నాయకులుగా కార్మికుల మన్ననను పొందారన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఎస్‌టీఐ కుమారి, సీఐటీయూ కార్యదర్శి ఎం.వసంతరావు, తులసిరావు, జయరావు, భాస్కరరావు, రాంబాబు, రామ్మోహన్‌రావు, సుబ్బారావు, నారపరెడ్డి, బాబూరావు, కొండయ్య, వెంకటేశ్వర్లు, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వాసు, మజ్దూర్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు

జె.పంగులూరు: మండల పరిధిలోని కొండమంజులూరు సొసైటీ అధ్యక్షునిగా బత్తుల వెంకట్రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. వెంకట్రావుతో పాటు పాలకవర్గ సభ్యులుగా చింతల చెరువు రుబేన్, బైటమంజులూరు గ్రామానికి చెందిన బత్తుల వెంకట్రావు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. రైతులకు సకాలంలో పంట రుణాలు అందిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ కర్రి వెంకటసుబ్బారావు, జిల్లా మాజీ డైరీ చైర్మన్ బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, జాగర్లమూడి సొసైటీ అధ్యక్షుడు అల్లంనేని బ్రహ్మానంద స్వామి, రావులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ ఓ రక్షణ కవచం

మేదరమెట్ల: మహిళలకు రక్షణకవచం వంటిది శక్తి యాప్ అని చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు అన్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, సైబర్‌నేరాల గురించి గురువారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు రక్షణ కవచంలా శక్తి యాప్ పనిచేస్తుందని దీన్ని ప్రతి ఒక్క మహిళా తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ పోలీసు సేవలను మరింత చేరువచేస్తుందని దీని సమాచారం, వినియోగం ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించాల్సిన ఫోన్ నంబర్లపై కూడా అవగాహన కల్పించారు. కొరిశపాడు ఎస్ఐ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పర్చూరు మండలం చింతగుంట పాలెంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాబు మోసాలు తెలుసుకోండి


చింతగుంపల గ్రామంలో..

పర్చూరు(చినగంజాం): చంద్రబాబు కూటమి మోసాలను ప్రజలంతా తెలుసుకోవాలని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పర్చూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కఠారి అప్పారావు పిలుపునిచ్చారు. పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చింతగుంటపాలెం, నూతలపాడు గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు.

చినగంజాంలో..

వైఎస్సార్‌సీపీ పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి ఆదేశాల మేరకు చినగంజాం మండలంలోని చింతగుంపల గ్రామంలో బాబుష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, పాదర్తి ప్రకాష్, కేవీ సుబ్బారావు చౌదరి, కొల్లాటి ఏడుకొండలు, ఎంవీ రామారావు, కొండూరి గోవింద్, ఎన్. సుబ్బారెడ్డి, వాటుపల్లి బలరాం, ఆసోది సూర్యనారాయణరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి, సైదా, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు,

విద్యాశాఖ ఏకపక్ష ధోరణి సరికాదు

ఇంకొల్లు(చినగంజాం): పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులను కాదని ప్రభుత్వ ఉపాధ్యాయులకు అధికారాలను కట్టబెట్టడం పట్ల విద్యాశాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న ఏక పక్ష ధోరణి సరికాదని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరకొండ ప్రసాదరావు, పిడవర్తి పేరిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో 97 శాతం ఉన్న పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులను కాదని 3 శాతం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తదితర పోస్టులు కట్టబెట్టడం అన్యాయమన్నారు. గౌరవ న్యాయస్థానాలు యథాస్థితిని కొనసాగించమని చెప్పినప్పటికీ ఏక పక్షంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు అనుకూలంగా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారుల పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రధానోపాధ్యాయులను మాత్రమే కాకుండా ఆ యాజమాన్యంలోని స్కూల్ అసిస్టెంట్‌లతో భర్తీ చేయడానికి పూనుకోవడం పట్ల వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీవో నంబర్ 154 ప్రకారం మండల విద్యాశాఖాధికారుల పోస్టులు కేవలం 13 మాత్రమే ఉన్నాయని మిగిలిన 666 పోస్టులకు మండల విద్యాశాఖాధికారి 1 పోస్టులో పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులను పరిగణలోనికి తీసుకోకుండా జూనియర్స్ అయిన ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లకు కట్టబెట్టడం సర్వీసు రూల్స్ గండి కొట్టడమేనన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

అద్దంకి: ప్రతి బ్యాంకు బ్రాంచ్, ఏటీఎం తదిరల ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ సుబ్బరాజు చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన బ్యాంకు మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలతోపాటు వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని చెప్పారు. దాని వలన నేర నియంత్రణతోపాటు, సత్వర నేర పరిశోధనకు ఉపకరిస్తుందని చెప్పారు. బ్యాంకులకు వచ్చే అపరిచత వ్యక్తును గనమించాలన్నారు. భద్రతా చర్యల దష్ట్యా చెప్పిన నియమాలను పాటిస్తే నేరాలను నియంత్రించడం సులవవు అవుతుందని చెప్పారు. వివిధ బ్యాంకు మేనేర్లు పాల్గొన్నారు.

ముగిసిన శిల్పం.. చిత్రలేఖనం శిక్షణ తరగతులు

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషాసాంస్కృతిక శాఖ సౌజన్యంతో వర్ణికాఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన శిల్పం-చిత్రలేఖనం శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమోంటోలను కేఆర్‌కే కళాశాల జూవాలజీ లెక్చరర్ బీఏ అశోక్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వర్ణికాఫైన్ ఆర్ట్స్ అకాడమీ ప్రెసిడెంట్ కత్తి బాల కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులను ఎప్పటికీ మరవకూడదు


వెంకటస్వామి దంపతులను సత్కరిస్తున్న చంద్రశేఖర్, ఆయన తండ్రి రామారావు

బల్లికురవ: విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఏ స్థాయిలో ఉన్న మరవరాదని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. చంద్రశేఖర్ అన్నారు. కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన డి. వెంకటస్వామి మాస్టార్‌ను పూర్వ విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలుతో ఘనంగా సత్కరించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగం రాకమునుపే మాస్టారు ఆయన సతీమణి రాజ్యలక్ష్మి తనకు విద్యాబుద్ధులు నేర్పారని ఉపాధ్యాయుడుగా ప్రభుత్వ ఉద్యోగం వచ్చిన తదుపరి 3 దశాబ్దాల పాటు గ్రామంలోనే ఉంటూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. వివిధ హోదాలతో పాటు ఎన్నార్లైలుగా స్థిర పడ్డారన్నారు. మాస్టార్ దంపతులను గుర్రపుబగ్గిపై ఉంచి గ్రామోత్సవం, ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంఈవో1,2లు శ్రీనివాసరావు, రమేస్‌బాబు, పూర్వవిద్యార్థులు పరిటాల పవన్‌కుమార్, జవ్వాజి పూర్ణ చంద్రరావు, బత్తుల రామాంజనేయులు, మూఢవత్ శ్రీనివాసరావు, మాస్టర్ అందించిన సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయులకు విరామం లేదు


రిటైర్మెంట్ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జె.పంగులూరు: ఉపాధ్యాయులుగా పనిచేసిన వారికి రిటైర్మెంట్ సహజమే అయినప్పటికీ, ఈ సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తూ, మార్గదర్శకులుగా పనిచేస్తూ ఉంటారని, వీరికి విరామం ఉండదని వక్తలు పేర్కొన్నారు. పంగులూరు జిల్లా పరషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేసిన టంగుటూరి పద్మజ, షేక్ నబి రసూల్‌కు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో జరిగిన సన్మాన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారుపల్లి రమేష్, రిటైర్మెంట్ అయిన మాజీ హెచ్ఎం కొప్పోలు రమాదేవి మరికొందరు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ అయిన భావిజీవితం కోసం పనిచేయాలన్నారు. అప్పుడే ఉపాధ్యాయ వృతికి వన్నె వస్తుందని చెప్పారు. టంగుటూరు పద్మజ, షేక్ నబి రసూల్‌కు సన్మానం చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎత్కరించి వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు కంకణాల శ్రీనివాసరావు, భాస్కర్ మూర్తి, దుర్గాప్రసాద్, ఆర్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.